విశాలాంధ్ర గుంటూరు జిల్లా

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : నిడమర్రు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు విజయ పికల్స్, బిట్రా సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ ఉచిత బస్సు పాసులను అందజేశారు. ప్రభుత్వం ఆర్టీసీలో విద్యార్థులకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణంకు సంబంధించి ఒక్కో విద్యార్థి బస్సు పాస్‌కు చెల్లించాల్సిన రూ.60లను సదరు దాతలు 250 మంది విద్యార్థులకు చెల్లించి పాసులు ఉచితంగా అందజేశారు. విజయ పికిల్స్ యజమాని కాట్రు రాము, బస్ స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ డీజీ నాయక్ ద్వారా విద్యార్థులకు పాసులు అందజేశారు. అనంతరం డిప్యూటీ సూపరింటెండెంట్ నాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థులు హైస్కూల్‌కు వచ్చేటప్పుడు వారికి ప్రయాణ భారం పడకూడదని ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. విద్యార్థులు పాసులకు చెల్లించాల్సిన నగదును దాతలు చెల్లించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం ఏ.బాల చంద్రారెడ్డి, పీఈటీ ఎన్.రవి, ఆర్టీసీ సిబ్బంది జీవీఎస్ మన్యం, కొండవీటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాట వంతెన పరిశీలన

విశాలాంధ్ర-దుగ్గిరాల : కొత్త లాకుల వద్ద ఉన్న కాలిబాట వంతెనను శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ ఇనుప పైపులు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదాచారులు, వాహనచోదకులు భయపడుతున్నారు. ఈ విషయంపై స్థానిక నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన అధికారులు వంతెన వద్దకు వచ్చి పరిశీలన చేశారు. వంతెనకు ప్రక్క గోడలను నిర్మాణం చేపట్టేందుకు కొలతలను తీసుకున్నారు. వంతెనపై వెళ్లే వారికి ఎటువంటి ప్రమాదం జరగకుండా తాత్కాలిక బాట ఏర్పాటు చేసి, మరో 20 రోజుల్లో అంచనా వేసి పూర్తిస్థాయిలో ఇనుప గోడల నిర్మాణం చేపట్టనున్నారు. పరిశీలించిన వారిలో నీటిపారుదల శాఖ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ మల్లికార్జున, డీఈ ఎన్‌కేవీ ప్రసాద్ రావు, ఎంపీడీఓ భార్గవి, ఏఈ వనిత, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, గద్దె వాసు, తాడిబోయిన ఏడుకొండలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు చురుకుగా ఉండాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రూరల్ పరిధిలో నేరాల నియంత్రణ కోసం గ్రామ సమాచార సేకరణలో మహిళా సిబ్బంది చురుకుగా ఉండాలని మంగళగిరి రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ సూచించారు. గ్రామాలకు చెందిన గ్రామ మహిళా పోలీస్ సిబ్బందితో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ గ్రామాలలో జరిగే చట్ట విరుద్ధ కార్యకలాపాలు, రౌడీషీటర్ల కదలికల గురించి గ్రామంలో నెలకొన్న పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. గ్రామస్తులు వారి వారి గృహ నివాసాలకు, వర్తక సముదాయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నేరాల నియంత్రణతో పాటు చేదనలో కూడా తోడ్పాటుగా ఉంటుందని ఆయన తెలియజేసారు.

వర్షాలతో పంటలకు మేలు

విశాలాంధ్ర-తాడికొండ : ఈ ఏడాది అనుకున్న సమయానికి వర్షాలు పడ్డాయి. పంట పొలా లు పదునెకటంతో రైతులు పలు రకాల పంటలను సాగు చేస్తున్నా రు. మండలంలో ఇప్పటికే పత్తి, వరి, మినుము, పెసర, నువ్వులు, మిశ్రమ పంటగా కంది సాగు చేస్తున్నారు. కాస్తంత ఆలస్యమైన ఇటీవల నిత్యం వర్షా లు కురుస్తున్నాయి. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పంటలకు రైతులు ఎరువు కట్టలను వేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేస్తున్నాయి.

వెదకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-తాడికొండ : ఇప్పటికే వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు వెదకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలంలో తాడికొండ, లాం, పొన్నెకల్లు, రావెల, పాములపాడు, బండారుపల్లి, గరికపాడు గ్రామాలలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఖర్చులు పెరగటంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా వెద పెట్టి పంటను పండిస్తున్నారు. గతంలో అరకలు ద్వారా వెధ పెట్టేవారు. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఏడాది కూడా రైతులు వెద పద్ధతి ద్వారా వరి పంటను సాగు చేస్తున్నారు. వరి పంట మూడు నాలుగు అంగుళాలకు చేరింది.

నాగేశ్వరరావు సంకల్పం ఆదర్శనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తన జీవితం ముగిసినా గానీ మరో రెండు జీవితాలకు వెలుగునివ్వాలన్న ఆలోచనతో ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు ఓ సీనియర్ సిటిజన్. వివరాల్లోకి వెళ్తే గుంటూరు, వెంగయ్య నగర్‌కి చెందిన వేముల నాగేశ్వరావు కిడ్నీ సమస్యతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 13వ తేదీన అడ్మిట్ అయ్యారు. రెండు రోజుల పాటు వెంటిలేటర్‌పై చికిత్స తీసుకోని 15వ తేదీ ఉదయం మరణించారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంకుకి దానం చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ మేరకు దానం చేసి మరో రెండు జీవితాలకు వెలుగునిచ్చారు వేముల నాగేశ్వరావు. మృతుడు నాగేశ్వరావు నేత్రాలను దానం చేయటానికి ముందుకు వచ్చిన వారి కుటుంబ సభ్యులు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు.

డాల్డా కంపెనీ వద్ద ఇళ్లల్లోకి వర్షం నీరు

విశాలాంధ్ర-తాడేపల్లి : గత 4 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాడేపల్లి డాల్డా కంపెనీ వద్ద పేదల ఇళ్లల్లోకి వర్షం నీళ్లు చేరడంతో సుమారు 10 కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్ వద్ద నుంచి క్యాపిటల్ సిటీ వరకు కచ్చా డ్రైన్ తీయించి వర్షం నీళ్లు బయటకు పంపించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధికారులను కోరారు.

నేడు తోటమ్మ తల్లి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-పొన్నూరు : ప్రసిద్ధి తోటమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 20న హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ నాగమల్లేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్యామల పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు సమక్షంలో హుండీ లెక్కింపు జరుగునని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

లోకేష్ 'ప్రజాదర్బార్'కు విన్నపాల వెల్లువ

విశాలాంధ్ర-తాడేపల్లి : సమస్యల పరిష్కార వేదిక 'ప్రజాదర్బార్'కు వస్తున్న విన్నపాలపై వారం వారం సమీక్షించనున్నట్లు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్' కార్యక్రమానికి మంగళగిరితో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. తాము పడుతున్న కష్టాలు, సమస్యలపై యువనేతను నేరుగా కలిసి అర్జీలు ఇస్తున్నారు. ఆయా విన్నపాలను శాఖల వారీగా విభజించి సమస్యల పరిష్కారానికి కృషిచేయడం జరుగుతోంది. ప్రజల అర్జీలు ఎంతమేరకు పరిష్కారం అయ్యాయి, వాటి స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆయా విన్నపాలపై ప్రతివారం సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు యువనేత వెల్లడించారు. జోరువానలోనూ 19వ రోజు నారా లోకేష్ 'ప్రజాదర్బార్'కు వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న 27 వేల మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అద్దె భవనంలో ఉన్న తాడేపల్లి కృష్ణనగర్ అంగన్‌వాడీ పాఠశాలకు స్థలం కేటాయించడంతో పాటు శాశ్వత భవనం నిర్మించాలని డి.లీల లోకేష్‌ను కోరారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని నవులూరుకు చెందిన బేతపూడి కోటేశ్వరరావు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు పిల్లల చదువులు భారంగా మారాయని, ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన టి.మైనర్ బాబు కోరారు. సివిల్ ఇంజనీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆత్మకూరుకు చెందిన సీహెచ్.కల్యాణ్ బాబు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని యువనేత భరోసా ఇచ్చారు.

హాస్టళ్ల విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గత 7 సంవత్సరాలుగా ట్రంకుపెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయంటే ఇది సహించరాని విషయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ చెప్పారు. తెనాలి గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023వ సంవత్సరం నవంబరు నెల నుండి మెస్ కాస్మోటిక్స్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని, అందువలన హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయలేక పోయారని వాపోయారు. తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు గండు శివనాగరాజు మాట్లాడుతూ, ఎయిడెడ్ కళాశాలల్లో పీజీ చదివే విద్యార్థులకు గత ప్రభుత్వం జిఓ నెం 77ను తీసుకువచ్చి ఉన్నత చదువులకు ఆటంకంగా మార్చిందన్నారు. నేడు విద్యాశాఖ మంత్రిగా వున్న నారా లోకేష్ ఆయన పాదయాత్రలో ఈ జిఓ నెం.77ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని చెప్పారు. తెనాలిలో వున్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించకుంటే జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం ముట్టడికి పిలుపు ఇస్తామని అన్నారు. ఈ నెల 20 నుండి 30వ తేదీ వరకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హాస్టల్ వసతి గృహాలను సందర్శన చేస్తామని, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి, భూమేష్, తేజ, మద్దినేని కిరణ్‌బాబు తదితరులు మాట్లాడారు.

విద్యార్థి నేతలు, రైతులపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను తొలగించాలి: సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రాష్ట్రంలో యువజన విద్యార్థి నేతలతో పాటు అమరావతి రైతులు, నల్లమడ రైతులతో పాటు ప్రజా సంఘాలు, మీడియా అధినేతలు, సోషల్ మీడియా కార్యకర్తల పైన గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమకేసులను త్వరితగతిన విచారణ చేసి తొలగించాలని, ఓడిపోయాక మీడియా యాజమాన్యాల పైన బెదిరింపులకు పాలపడుతున్న వైసీపీ ముఖ్యనాయకులుకు అడ్డుకట్ట వేయాలని ఎపి డిజిపి ద్వారకా తిరుమల రావుని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ కోరారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ ద్వారకా తిరుమల రావుని రావిపాటి సాయి కృష్ణ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ గడచిన అయిదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ ఎపి సిఐడితో ఎన్నో అక్రమ కేసులు వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఎందరో యువత విద్యార్థులు ఉన్నత చదువులకి విదేశాలకు వెళ్లకుండా కేసులు అడ్డంకిగా మారటంతో పాటు వారి భవిష్యత్ అయోమయానికి గురి అవుతున్నారని తెలియజేసారు. ఇందుకు డిజిపి ద్వారకా తిరుమల రావు సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ప్రభుత్వంతో చర్చించి అక్రమ కేసులు తొలగింపు దిశగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు.

జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీలకు 'కొండమ్మ'

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రముఖ కవి దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి ఫిల్మ్ సొసైటీ హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు షార్ట్ ఫిలిమ్ పోటీలకు త్రినేత్ర ప్రొడక్షన్స్ ఉండవల్లి వారి 'కొండమ్మ' షార్ట్ ఫిల్మ్ ఫైనల్ స్క్రీనింగ్‌కు ఎంపికైనట్లు త్రినేత్ర ప్రొడక్షన్స్ అధినేత, రచయిత, దర్శకులు గాదె నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పోటీలకు వచ్చిన షార్ట్ ఫిల్మ్స్ అన్నింటినీ స్క్రూటినీ చేసిన అనంతరం ఆరు షార్ట్ ఫిల్మ్‌లను ఫైనల్ స్క్రీనింగ్‌కు న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారని, ఈ ఫైనల్ స్క్రీనింగ్‌లో 'కొండమ్మ'కు స్థానం దక్కిందని నాగభూషణం తెలిపారు. ఈ నెల 21న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని మెయిన్ ఆడిటోరియంలో ఫైనల్స్‌కు ఎంపికైన షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శన జరుగుతుందని, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని చెప్పారు.

దళారులకు వరంగా కౌలు రైతు కార్డులు

విశాలాంధ్ర-మేడికొండూరు : మండలంలో కౌలు రైతు కార్డులు కొందరు దళారీలకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా దళారీలకు కాసుల పంట పండిస్తుంది. బడుగు బలహీన వర్గ నిరుపేద కౌలు రైతులకు చెందాల్సిన రైతు భరోసా డబ్బులతో దళారీలు తమ జేబులు నింపుకొని పేదల కడుపు కొడుతున్నారు. వివరాల్లోకి వెళితే మేడికొండూరు మండలంలో కొందరు దళారీలు తమ భూమితో పాటు తమకు తెలిసిన వారి భూమి పాసుపుస్తకాల జిరాక్స్‌లతోపాటు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని తమకు అనుకూలంగా ఉన్న వ్యవసాయం చేయని రైతు భరోసాకు లబ్ధి చేకూరే వ్యవసాయ కూలీలకు ఒక్కొక్కరికి అర్ధ ఎకరం, ఎకరా భూమిని కౌలుకు ఇచ్చినట్లు భూ యజమాని సంతకాలు ఫోర్జరీ చేసి కౌలు రైతు కార్డులు ఇప్పిస్తున్నారు. కౌలు రైతు కార్డు పొందాలంటే 1 ఎకరం ఉండాలన్న నిబంధనలను తుంగాలో తొక్కిన అధికారులు అర ఎకరంకు సైతం కౌలు రైతు కార్డులు మంజూరు చేసారు. దీనితో రెచ్చిపోయిన దళారీలు అడ్డదారిలో విచ్చలవిడిగా కౌలు కార్డులు ఇప్పించి తమ జేబులు నింపుకున్నారు. జీరో బ్యాంకు ఖాతా తెరవటం మొదలు కౌలు రైతు కార్డులు ఇప్పించేంతవరకు అధికారులకు ముడుపులు ముట్టజెప్పి కౌలు రైతు కార్డులు వచ్చేంతవరకు అన్ని తామై ఈ దళారీలు దగ్గరుండి పనులు చక్కబెడుతున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కౌలు రైతులకు రైతు భరోసా కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే మొత్తం రూ.13,500లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆయా కౌలు రైతు కార్డులు పొందిన వ్యవసాయ కూలీలను బ్యాంకుల వద్దకు పిలిపించి బ్యాంకులో జమ అయిన నగదును విత్ డ్రా చేసిన తర్వాత వారికి కొద్దిపాటి నగదు ముట్టజెప్పి పెద్ద మొత్తంలో ఈ దళారీలు వారి వద్ద నుంచి వసూలు చేసి తమ జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న భూ యజమానులు తమ పొలాలకు ఏ ముప్పు పొంచి ఉందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గత సంవత్సరం లబ్ధిదారులను విచారణ చేస్తే ఈ దళారీల బాగోతం బయటపడుతుందని మేడికొండూరులో భూ యజమానులు పెద్దఎత్తున చర్చించుకుంటున్నారు.

శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి: లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేయరాదని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. ఆంధ్ర రాష్ట్రంలో నేడు అనేక చోట్ల విధ్వంసకరమైన చర్యలు, వ్యక్తిగత దాడులు, ప్రతీకార చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. అప్పుల్లో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలంటే దాడులకు స్వస్తి పలికాలన్నారు. టీడీపీ కార్యాలయాలపై దాడులు చేసినప్పుడు..అసెంబ్లీలో చంద్రబాబు కుటుంబం పట్ల అవహేళనగా మాట్లాడిన పృదు.. అనేక విధ్వంసకర దాడులు జరిగినప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవ్వుకుంటూ.. ఆనందం పొందుతూ దాడులు చేసిన వారిని ప్రోత్సహిస్తూ ఉండేవారని ఆరోపించారు. వైఎస్ జగన్ ఆనాడే ఇది తప్పు..ఇది ప్రజాస్వామ్యా నికి విరుద్ధం.. ఇటువంటి దాడులు రాష్ట్ర అభివృద్ధికి తగదని చెప్పి ఉండి ఉంటే ఈ రోజు ఇటువంటి దాడులు, హత్యలు జరిగేవి కావన్నారు. గతంలో వైసీపీ వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న వారు నేడు దాడులు, హత్య లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ చేసిన తప్పులే టీడీపీ చేయాలనుకోవడం.. మంచిది కాదని, ఇటువంటి సంఘటనలు జరుగుతున్నప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కక్షలు వద్దు.. అభివృద్ధి ముఖ్యమని పదేపదే చెప్తున్న విషయాన్ని లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఎవరైనా తప్పులు చేసి ఉంటే చట్ట ప్రకారం శిక్షిద్దామే తప్ప వ్యక్తిగత దాడులకు పూను కోవద్దని సూచించారు. శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి చెందుతుందని, పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నగర శాఖ కోరింది. ఈ మేరకు ఎంఈఓ-1గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టీవీ రమణ య్యను శుక్రవారం ఎస్టీయూ నగర నాయ కులు కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై వారు చర్చించారు. ఉపాధ్యాయుల ఎస్ఆర్‌లను అప్‌డేట్ చేయడం, ఇన్‌కమ్ ట్యాక్స్‌కు సంబంధించిన టీడీఎస్‌ను వెంటనే పూర్తి చేయడం, మిగులు ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేయడం, ఆగస్టు 31న రోల్‌ను పరిగణలోకి తీసుకోవడం తదితర అంశాలను నాయకులు ఎంఈఓ-1 దృష్టికి తీసుకువెళ్ళారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు కె.విజయబాబు, వై.శ్యాంబాబు, వి.శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకయ్య, యు.మహంకాళ రావు, డీవీ సుబ్బారావు, సీహెచ్ జయసుందర్, జి.అప్పలనారాయణ, కె.విజయకు మార్, హరినాథ్, కె.అనిల్ కుమార్, ఎన్.శ్రీనివాసరావు, ఆర్.రామనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీ & పీఎన్‌డీటీ చట్టంపై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-తెనాలి : సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పియన్‌డిటి కమిటి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, తెనాలి డివిజన్లో మొత్తం 66 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, పిసి అండ్ పియన్‌డిటి చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని తెలిపారు. ఈ విషయాన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పక పాటించాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంటుందని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన అవసరం వుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.శారద, సినీయర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్ కుమార్, తెనాలి డియస్‌పి రమేష్‌బాబు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ళ నుండి తిష్ట వేసి ఉన్న ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదని శాసనసభ్యురాలు గళ్ళా మాధవి తెలిపారు. డివిజన్ల పర్యటనల్లో భాగంగా శుక్రవారం 20వ డివిజన్ లోని కొబ్బరి తోట, నంబూరు సుభాని కాలనీ, బాబు రాజేంద్ర ప్రసాద్ కాలనీలలో పర్యటించారు. డివిజన్‌లో సమస్యలను పరిశీలించి, అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం వచ్చిందంటే పీకలవాగు ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, నంబూరు సుభాని కాలనీలో చిత్తడి రోడ్లు, మురుగు నీరుతో ప్రజారోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. అదేమాదిరిగా జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, వర్షపు నీరు నిలిచి ఉండటాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వెంటనే పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. పీకల వాగులోని వ్యర్థాలను తొలగించి, రోడ్డు మీద వేయటం వలన తీవ్ర దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు డివిజన్‌లలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. బ్రాడీపేట ప్రధాన రోడ్డులోని సైడ్ కాలువల నిర్మాణానికి 50 లక్షల రూపాయల అంచనాలు, అదే విధముగా అరండల్ పేటలో సిసి రోడ్డు, సైడ్ కాలువల పనులు ప్రారంభించనున్నారు.

కేఎల్‌యూలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ రెగ్యులర్ విభాగం ఆధ్వర్యంలో జనరేటివ్ ఏఐ, కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు) ఒక మైలురాయి అని విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ అన్నారు. సదస్సుకు దాదాపు 160 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ముఖ్య అతిథులుగా మైసూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.హేమంత్ కుమార్, కలకత్తాకు చెందిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి ప్రసాద్ ముఖర్జీ, చెన్నైలోని భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఆర్ఎం సురేష్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఎల్ వర్సిటీలో జరుగుతున్న ఈ సదస్సు వలన జనరేటివ్ ఏఐలో అత్యాధునిక పరిణామాలను అన్వేషించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధకులు, ఆవిష్కర్తలను, అభ్యాసకులను ఒకచోట చేర్చినట్లయిందన్నారు. కృత్రిమ మేధస్సులో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్షేత్రం, నూతన అభ్యాసం, చిత్రాలు, శబ్దాలు, మానవ-వంటి పరస్పర చర్యలను స్వయం ప్రతిపత్తితో సృష్టించగల యంత్రాల సామర్థ్యంపై దృష్టి పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొ వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్, కన్వీనర్-డాక్టర్ కె.భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మంత్రి ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆకస్మిక పర్యటనలు చేశారు ఇందులో భాగంగా ఉదయం చెంచుపేటలోని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు చేరుకున్న మనోహర్ అక్కడి పరిస్థితులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వారినే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్యాధికారులతో మాట్లాడి రోగులకు ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆసుపత్రిలో పారిశుద్య నిర్వహణ మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాల ఓపీ వద్ద జనం ఎక్కువ మంది ఉన్నారని వైద్యుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం చెంచుపేటలోని రైతుబజార్‌ను మంత్రి మనోహర్ సందర్శించి ధరల పట్టికలను పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని యడ్లలింగయ్య కాలనికి వెళ్ళి అక్కడ పారిశుద్య నిర్వహణ, మురుగు కాల్వల్లో పారుదల తదితర వాటిని పరిశీలించారు. కొన్నిచోట్ల అపరిశుభ్ర వాతావరణం ఉండటం గమనించి అధికారులకు తగు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతోపాటు కలసి రోడ్లు, డ్రెయిన్లు పరిశీలించారు.

డాక్టర్ షమా సుల్తానకు ఘన సన్మానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్)ఆధ్వర్యంలో విజయవాడలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో సందు సమాజ సేవ చేసిన పలువురు అధికారులను.. అలాగే ఎంహెచ్‌పీఎస్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన, ప్రధాన కార్యదర్శి మెహపారాలను రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర నాయకులు టీడీ జనార్దన్ గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ, ఎంహెచ్‌పీఎస్ కార్యకర్తలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీకి కాపునాడు నాయకుల అభినందనలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సతీష్ కుమార్‌కు కాపునాడు నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఎస్పీకు అభినందనలు తెలియజేసిన వారిలో జనసేన, టీడీపీ నాయకులు మిరియాల గోపి కుమార్, యర్ర నాగేశ్వరరావు, రాగం సదాశివరావు, కందుల సైదం, జొన్నకూటి లవకుమార్, విన్నకోట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎన్నికల హామీ మేరకు రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని, జీఓ 22ను రద్దు చేయాలని, కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.2 లక్షల వరకు రైతు, కౌలు రైతులకు అన్ని రకాల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 4,5 వార్డుల సచివాలయం అడ్మిన్‌కు అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, నాయకులు బుర్రముక్కు గోపాల్ రెడ్డి, భీమవరపు దశరథరామిరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

విశాలాంధ్ర-పొన్నూరు : 20వ వార్డు ఎస్టీ కాలనీలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. పొన్నూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్యామల మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకోవాలని, అలానే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చిర్రావూరు మురుగు కాలువ పూడికతీత

విశాలాంధ్ర-తాడేపల్లి : గత వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో, చిర్రావూరు, గుండిమెడ, ప్రాతూరు గ్రామాలలో సుమారు 600 ఎకరాలు వరి నాటిన పంట పొలాలు నీట మునిగాయి. వర్షపు నీరు బయటకు పోయే దారి లేక, మురుగు కాలువ పూడుకుపోవడంతో వర్షపు నీళ్లన్నీ పొలాల్లోనే నిలిచిపోయాయి. దీంతో రైతులు తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పరిష్కారం చేయాలని కోరుతూ సమస్యను టీడీపీ గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం సమస్య పరిష్కారం కోసం జేసీబీని తీసుకువచ్చి పూడుకు పోయిన మురుగు కాలువలో మట్టిని, కాడను తీయించి, పంట పొలాలలో వర్షపు నీరు, పోయే విధంగా పనులు చేయించారు. దీంతో పలు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు అనేక ఇబ్బందులుపడుతున్న మురుగు కాలవ సమస్యను గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో గ్రామ తెలుగుదేశం పార్టీ రైతులకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సిహెచ్ లాల్‌చండ్, పోకల పాములు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను ఆ శాఖ కార్యదర్శి సునీల్ రాజకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కలియతిరిగారు. డార్మెటరీ, తరగతి గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంటగది పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. వారి వెంట ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

గుంటూరు సిటీ, ముత్యాలరెడ్డి నగర్ 9వ లైను, యజ్ఞ రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.402 నివాసి మాగులూరి శివ గోవింద రావు (సెల్: 9533922684) తండ్రి: మాగులూరి నారాయణ. నా భార్య మాగులూరి వసుంధర పేరిట పెదకాకాని డి.నెం.551/2 నందలి చ.గ.145-2ల ఆస్తి తాలూకు విక్రయ దస్తావేజు నెం. 1474/2006 ఒరిజినల్‌ను ది.05-07-2024న పెదకాకాని సెంటర్‌లో జిరాక్సు తీయించుకుని సమీపంలోని టీస్టాల్ వద్ద ఆగి చూసుకొనగా కనిపించలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

ఆర్డీవో కార్యాలయానికి కలెక్టర్

విశాలాంధ్ర-గురజాల: పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు శుక్రవారం ఉదయం గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాల యాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తొలిసారిగా గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయనను రెవెన్యూ డివిజన్ అధికారి రమణ కాంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన గురజాల రెవెన్యూ డివిజన్ పరిధిలో వస్తున్న భూ సమస్యలు మరియు రెవెన్యూ సంబంధించిన సమస్యలు గురించి వివరాలు సేకరించారు. అదేవిధంగా రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది గురించి తెలుసుకొని వారి వివరాలను సేకరించారు. అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి రమాకాంత్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

విశాలాంధ్ర-రెంటచింతల: మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ శర్మ శుక్రవారం స్థానిక మండల పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో చిన్నారులు కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని తిని రుచిచూశారు. ఆంజనేయమాన్యంలోని అంగన్వాడీ-4 కేంద్రాన్ని పరిశీలించారు. పిహెచ్సి కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. గత కొద్ది రోజులుగా అతిసారా ప్రబలుతున్న దృష్ట్యా నివారణకోసం తీసుకుంటున్న చర్యలు, జ్వరాలు సోకితే కావాల్సిన మందులు తగినన్ని నిల్వలు ఉన్నాయాని ఆరా తీశారు. వీరి వెంట ఎంపీడీఓ శంకరరావు, ఎంఈఓ-2 శివనాగేశ్వరరావు వివిధ శాఖల అధికారులున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: 55వ బ్యాంకుల జాతీయ కరణ దినోత్సవం విను కొండ రైల్వే స్టేషన్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ గురుకుల పాఠశాల ఆవరణ నందు శుక్రవారం కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ వారు సోషల్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రాంలో భాగంగా పదో తరగతి చదువుతున్న బాలికలకు సిబిఎస్ గైడ్స్ సిలబస్ని స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ స్టేట్ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కామ్రేడ్ ఈ రవిచంద్ర రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సిబిఈయు ఏపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ కామ్రేడ్స్ నాగరాజు, యాకోబు, రాజశేఖర్ రెడ్డి, చంద్రశే ఖర్, వీర వసంతారాయ్ యూనియన్ సభ్యులు కామ్రేడ్ చంద్రశేఖర్ , సాయి, సుబ్రహ్మణ్యం, హరీష్ , వెంకటేష్ ,మిర్యాలపల్లి అచ్చయ్య ఎస్ రాజేంద్రప్రసాద్ బి రవి తదితరులు పాల్గొన్నారు.

పత్తి పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

విశాలాంధ్ర-పెదకూర పాడు: మండలంలోని రైతులు పత్తి సాగు అధికంగా చేపట్టారని వ్యవ సాయ శాఖ అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు పంట పొలాల్లో నిలబడి పైరు ఉడకెత్తే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. మరో రెండు రోజులు తుఫాను కారణంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు గట్టులకు గండి కొట్టి వర్షం నీరును బయటకు పంపిస్తున్నారు. ఇంకను వర్షం ఎక్కువ రోజులు కురిస్తే పంట నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

అడిగోపుల మరణానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారులు అడిగోపుల వెంకటరత్నం మరణానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవానిదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం ఉదయం తిరుపతిలో తుది శ్వాస విడిచారు. వృత్తిరిత్యా గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజనీరుగా పనిచేసి పదవి విరమణ చేసిన ఆయన తిరుపతిలో స్థిరపడ్డారు. ప్రవృత్తిరిత్యా గత ఐదు దశబ్దాలకు పైగా అలనాటి భారతి పత్రిక నుంచి ఈనాటి అనేక పత్రికలలో వామపక్ష భావజాలంతో కూడిన వందలాది అభ్యుదయ కవితలు రచించారు. తెలుగు సాహిత్యరంగంలో తనదైన సంతకంతో అశేష కృషి చేసిన అడిగోపుల లేని లోటు పూడ్చలేనిదని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం భావిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రారంభం నుంచి గౌరవ సలహాదారులుగా తగు సలహాలు, సూచనలతో తనదైన సేవలను అందించడం మరువలేనిదని అన్నారు.

రేపు జిల్లా ఫుట్బాల్ ఎంపికలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ గర్ల్స్ కేటగిరి సంబందించి ఈ నెల 21వ తేదీన ఉప్పలపాడులోని జడ్పీహెచ్ స్కూల్ అవరణం నందు జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ సెలక్షన్స్ జరుగుతాయని జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ కుమ్మర క్రాంతికుమార్, జిల్లా సెక్రటరీ దుర్గా మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్ కొరకు వచ్చేవారు 2011-2012 సంవత్సరంలో పుట్టిన వారై ఉండాలని ఉండాలి. ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ భర్త్ సర్టిఫికెట్, పాస్పోర్టు సైజ్ ఫోటో తప్పనిసరిగా తీసుకొని రావాలని తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు స్కూల్ గ్రౌండ్ నుందు కోచ్ బ్రహ్మంని నేరుగా గానీ లేదా మొబైల్ నెంబర్ 7337585790లో సంప్రదించవచ్చని తెలిపారు. ఎంపిక అయిన వారు ఈ నెల 23, 24, 25 తేదీలలో తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చంద్రబాబుతో చర్చించిన ఎమ్మెల్యే చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట : ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా వడివడిగా అడుగులు వేస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అవకాశాలన్నింటినీ ప్రజల కోసమే వాడుతున్నారు. తాజాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని శుక్రవారం డాక్టర్ చదలవాడ కలసి నియోజకవర్గ అభివృద్ధి గురించి ప్రత్యేకంగా చర్చించారు. నరసరావుపేటలో నెలకొన్న అశాంతి, రాజకీయ ఘర్షణల గురించి వివరించారు. మరోవైపు సాగునీటి కాలువలన్నీ అధ్వాన్నంగా ఉండటంతో రైతులు అవస్థలు పడుతున్నారని, తూడు తొలగింపు చర్యలు వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనుల కేటాయింపులో కూడా నరసరావుపేటకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గతంలో అధికారంలో ఉన్న వ్యక్తులు నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని తెలిపారు. అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే మన పాలనలోనైనా నరసరావుపేటను బాగుచేసుకునే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు.

జగన్ శవరాజకీయాలు సిగ్గుచేటు: ఎమ్మెల్యే జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన హత్యకు రాజకీయరంగు పులిమి శవ రాజకీయాలు చేయటం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి సిగ్గుచేటని వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయినప్పటి నుంచి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని జీవి విమర్శించారు. రాష్ట్రంలో ఏమి జరిగిందని రాష్ట్రపతి పాలన పెట్టాలంటూ జగన్ రెడ్డి మాట్లాడుతున్నాడో అర్థం కావటం లేదన్నారు. వైసిపి పాలనలో గాడి తప్పిన శాంతి భద్రతలను టిడిపి ప్రభుత్వం కాపాడుతుందన్నారు. 23 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హెూదాపై, పోలవరం ప్రాజెక్టుపై, అమరావతి రాజధానిపై ఢిల్లీలో మాట్లాడని జగన్ రెడ్డి నేడు ఢిల్లీలో దీక్షలు చేస్తానని చెప్పడం తన అవివేకానికి నిదర్శనం అన్నారు. హంతకుడు జిలాని, మృతుడు రషీద్ ఇద్దరు గతంలో మీ పార్టీకి చెందిన వారేనని, వైసిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు పిఎస్ ఖాన్ వర్గీయులు అన్నారు. వారి మధ్య జరిగిన వ్యక్తిగత ద్వేషాలు ఘర్షణల నేపథ్యంలో విడిపోవటం పిఎస్ ఖాన్ రషీదుకు మద్దతు ఇవ్వటం, అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వార్థం కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడి జిలాని కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం వలన ఇంతటి దారుణం జరిగిందన్నారు. రషీద్ హత్య ముమ్మాటికి పిఎస్ ఖాన్, బ్రహ్మనాయుడు పాపాలేన న్నారు. రెండేళ్ల క్రితం జిలాని ఇంటిపై రషీద్ వర్గీయులు దాడి చేసి కుటుంబ సభ్యులను గాయపరిచి, బుల్లెట్ మోటార్ సైకిల్ని దగ్ధం చేస్తే పోలీసులు కేసు కట్టకుండా బొల్లా బ్రహ్మనాయుడు అడ్డుకోవడం, తదుపరి జిలానిపై కొన్ని కేసులు బనాయించడం వలన ఇలా జరిగిందని ఎందుకు మీ పార్టీనే ప్రధాన కారణమని అన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా మాజీ సీఎం హెూదాలో జగన్మోహన్ రెడ్డి టిడిపిపై బురద చల్లడం దుర్మార్గమ న్నారు. రషీద్ హత్యకు కారకులు బ్రహ్మనాయుడు, ఖాన్ అని అందుకు బాధ్యత వహిస్తూ జగన్మోహన్ రెడ్డి వినుకొండ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో జల్లయ్య, చంద్రయ్య, నరసరావుపేటలో ఇబ్రహీం ఇలా ఎంతోమంది వైసిపి గుండాల చేతిలో హత్యకు గురైతే జగన్మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం సిగ్గుచేటు అన్నారు. మీ వైసీపీ పాలనలో దుర్మార్గాలను ప్రోత్సహించడం వలన ఇలాంటి చర్యలు జరిగాయని అన్నారు. పెనుకొండలో హత్య జరిగిన వెంటనే నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని, నింది తులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. వైసీపీ కార్యకర్తల వ్యవహరించిన రవిశంకర్ రెడ్డికి వత్తాస్ పలకటం జగన్ రెడ్డి నీతిమాలిన చర్యకు నిదర్శనం అన్నారు. ఐదేళ్ల పాలనలో అనేక హత్యలు, అమాయకులపై దౌర్జన్యాలు దుర్మార్గాలు దళితులపై దాడులు జరిగితే స్పందించని జగన్మోహన్ రెడ్డి ఇద్దరు వ్యక్తిగత కక్షలో చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చి శవ రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అసత్యాలు మాట్లాడటం బాధాకరమన్నారు. వినుకొండలో రౌడీ షీటర్ పిఎస్ ఖాన్ దగ్గర పని చేసిన ఇద్దరు రౌడీషీటర్లే రషీద్, జిలానీలు అని అన్నారు. వారి వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన హత్యకు రాజకీయాలకు పులమటం దుర్మార్గమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కోడికత్తి, వివేకా హత్యపై చర్చకు సిద్ధమా: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట : వ్యక్తిగత కక్షలతో జరిగిన గొడవలకు రాజకీయ రంగు పులిమి వీరంగం చేస్తున్న జగన్ రెడ్డికి ఐదేళ్ల పాలనలో జరిగిన హత్యలపై చర్చకు సిద్ధమా అని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సవాల్ చేశారు. ఎన్నికలకు ముందు కొడికత్తి, వివేకా హత్యల గురించి నానాయాగీ చేశాడు. చంద్రబాబు, లోకేష్పై నెట్టాడన్నారు. సొంత బాబాయిని చంపి నారా సురక్త చరిత్ర అంటూ టీడీపీపై తప్పుడు ప్రచారం చేశాడని మండిపడ్డారు. ఇప్పుడు వినుకొండలో జరిగిన హత్యను కూడా టీడీపీపై నెట్టడానికి జగన్ సిగ్గు పడాలన్నారు. వైసీపీ హయాంలో హతుడు రషీద్, నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై నాడే చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ హత్య జరిగేదికాదన్నారు. నాడు జగన్ రౌడీలను ప్రోత్స హించి హత్యలు చే యించి ప్రచారాలు మాత్రమేనని అన్నారు. 2019 ఎన్నికలు ముందు సానుభూతి కోసం బాబాయిని చంపి డ్రామాలాడారని, 2024 ఎన్నికలు ముందు ఒక అమ్మాయి శవంతో రాజకీయం చేయబోయారు. ఇప్పుడు ఓటమిని ఓర్వలేక నిందలు,ఫేక్ ప్రచారాలకు దిగుతున్నారు అన్నారు. ఇలాంటి సిగ్గులేని రాజకీయాల్ని ప్రజలు సహించబోరని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో వందలాది మందిని వైసీపీ ముఠా హత్యలు చేస్తే ఎప్పుడూ బయటకు రాని జగన్ ఇప్పుడు శవ రాజకీయాల కోసం మాత్రమే బయటకు వచ్చారన్నారు. ఇలాంటి ఫేక్ రాజకీయం, ఫేక్ బతుకు అవసరమా జగన్ రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రశ్నించారు. ఇప్పుడు నీతు లు చెబుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి బతుకు మొత్తం అబద్ధాలు, తప్పుడు

ఘనంగా న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ సదస్సు ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ 31వ వార్షిక రాష్ట్రస్థాయి సదస్సు గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ నందు శుక్రవారం ఘనంగా ప్రారంభమైందని ఏపీ న్యూరోకాన్ అధ్యక్షులు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి విజయ పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశంలోనే ప్రఖ్యాత న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు విచ్చేసి తమ అనుభవాలను పంచుకున్నారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ వైవి విష్ణు ఇన్ఫ్లమేటరీ మయోపతి అనే కండరాల సమస్య పై కొత్తగా వచ్చిన చికిత్స గురించి తెలియజేశారు. అలాగే చెన్నై నుంచి వచ్చిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీనరసింహన్ అల్జిమర్స్, డిమాండ్షియా వంటి వ్యాధులకు మోనో క్లోనల్ యాంటీ బాడీస్ అనే కొత్త రకం వైద్య విధానాన్ని తెలియజేశారు. అదేవిధంగా విశాఖపట్నం ఏఎంసి నుంచి వచ్చిన డాక్టర్ ఎస్. గోపి బ్రెయిన్ కు సంబంధించిన కొత్త రకం వైరల్ ఇన్ఫెక్షన్లు, కరోనా అనే కాకుండా నిఫా వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల గురించి.. వాటి నివారణ గురించి పేర్కొన్నారు. హైదరాబాదులోని రెయిన్బో హాస్పిటల్ నుంచి వచ్చిన డాక్టర్ లోకేష్ లింగప్ప ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్స్ అనే చిన్నపిల్లలు చూసే జబ్బులు గురించి మాట్లాడారు. నానమ్మ, తాతయ్యల వద్ద పెరిగే పిల్లలకు ఇతర కేర్ టేకర్స్ వద్ద పెరిగే పిల్లలకు భాషా ఉచ్చరణ దోషాలు ఉంటాయని తెలిపారు. పూణే నుంచి వచ్చిన డాక్టర్ ఎస్పి గోర్తి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ ద్వారా పక్షవాతం లాంటి ఇతర నరాల జబ్బులు గురించి మెరుగైన వైద్యం అందించగలిగే సులువైన మార్గాన్ని వివరించారు. తొలుత ఫ్రీ కాన్ఫరెన్స్ వర్క్ షాప్ న్యూరో సర్జరీకి దేశంలోని ప్రముఖ న్యూరో సర్జన్లు పాల్గొన్నారు.

జగన్‌కు స్వాగతం పలికిన నూరి ఫాతిమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించే నేపథ్యంలో వైఎస్ జగన్ గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోకి వచ్చిన సందర్భంగా ఆయనకు నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలతో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా అపూర్వ స్వాగతం పలికారు. గుంటూరు వై.జంక్షన్ వద్దకు జగన్ కాన్వాయ్ రావడంతో హైవేపై పార్టీ శ్రేణులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కారులోనే నుంచి బయటకు వచ్చి వైసీపీ శ్రేణులకు జగన్ అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు, వార్డు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-మంగళగిరి: మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులు అరెస్ట్ చేసినట్లు మంగళగిరి పట్టణ సిఐ డి.వినోద్ కుమార్ శుక్రవారం తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై విశాఖపట్నం నుండి తెచ్చి తాగుతూ, విక్రయిస్తున్న మంగళగిరి పట్టణ శివారు ఎర్రబాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులైన మాకిన అమర్నాథ్, కామినేని సాయి కృష్ణ, చింతల హరీష్ లను స్థానిక ఎయిమ్స్ ఆసుపత్రి సమీపంలో గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డి.ఎస్.పి సిహెచ్.రవికాంత్ ఆధ్వర్యంలో సిఐ డి.వినోద్ కుమార్, పోలీస్ సిబ్బంది ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ రంగంలోనే బ్యాంకింగ్ వ్యవస్థ కొనసాగాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దేశంలోని బ్యాంకులలో ఉన్న రూ. 225 లక్షల కోట్ల ప్రజాధనం సురక్షితంగా ఉండాలంటే బ్యాంకులన్నీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాల్సిన అవసరం ఉందని ఏబీఈఏ యూనియన్ ముఖ్య సలహాదారు పి.కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక హిందూ కళాశాల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) వద్ద 55వ బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంకు నాయకులు ఏఐబీఈఏ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ కార్యదర్శి సయ్యద్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిషోర్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ తరువాత దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి, సామాన్య ప్రజలకు ఋణాలు, చిన్న చిన్న పరిశ్రమలకు పెట్టుబడి అందించడం ఊపందుకుందని అన్నారు. బ్యాంకింగ్ సౌకర్యం పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో రాజకీయ జోక్యంతో నిరర్థక ఆస్తులు విపరీతంగా పెరగడం, ఈ పది సంవత్సరాలలో లక్షల కోట్లు మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు వ్యవసాయ ఋణాల మాఫీ అడుగుతుంటే ప్రభుత్వం కార్పొరేట్ ఋణాల మాఫీ చేపడుతుందన్నారు. ఋణ ఎగవేతదారులైన బడా పెట్టుబడీ వర్గాల మీద క్రిమినల్ కేసులు పెట్టి వారిని కఠినంగా శిక్షించాలని, బ్యాంకులలో వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, సామాన్యులు పొదుపు చేసుకొనే సేవింగ్స్ బ్యాంకు అకౌంట్స్‌కు ఇచ్చే వడ్డీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొనే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై రాబోయే రోజుల్లో ఏఐబీఈఏ ద్వారా ఉద్యమించాలని ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మురళీ, రవీంద్రా రెడ్డి, శివాజీ, షరీఫ్, క్రాంతి, పావని, పృథ్వీ, రామకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు ప్యాచ్ వర్క్‌లు చేపట్టండి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా ప్రధాన రహదారులకు ప్యాచ్ వర్క్లు తక్షణం చేపట్టాలని, ప్రజాప్రతినిధుల క్షేత్ర స్థాయి పర్యటనల్లో సంబందిత అధికారులు కూడా పాల్గొని, పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి, నియోజకవర్గంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణం తాత్కాలికంగా ప్యాచ్ వర్క్లు చేపట్టాలని, వర్షాకాలం అనంతరం శాశ్వత పరిష్కారంగా రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పశ్చిమ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులో పనులు ప్రారంభించడం చేయాలని, లేకుంటే వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈలకు స్పష్టం చేశారు. పీకలవాగుపై దెబ్బతిన్న కల్వర్టల నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే ఎక్కడైనా ద్యామేజి జరిగి, ప్రజల రాకపోకలకు ప్రమాదకరంగా ఉన్న వాటి వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పాత యూజీడీ సెప్టిక్ ట్యాంక్ స్థానంలో నూతన ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏటి అగ్రహారం రోడ్ విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి రోడ్ నిర్మాణం చేయాలని, దీని వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాల్వల్లో తీస్తున్న సిల్ట్‌ని వెంటనే తొలగించకపోవడం వలన మరలా అది కాల్వలోనే పడుతుందన్నారు. వీధిదీపాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈలు సుందరామిరెడ్డి, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు రమేష్ బాబు, మహ్మద్ రఫిక్, కళ్యాణ రావు, శివ కుమార్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు: కలెక్టర్, ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐసీఏఆర్‌కు ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ అధికారులను శురవారం ఆదేశించారు. నిబంధనల ప్రకారం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అనువుగా ఉండే 50 ఎకరాల స్థలం జిల్లాలో ఎక్కడైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించే సంస్థలు జిల్లా నలుదిశలా ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. ఇప్పటికే నకరికల్లు మండలంలో నెలకొల్పిన ఇండో-ఇజ్రాయెల్ వ్యవసాయ ప్రాజెక్టుకు కృషి విజ్ఞాన కేంద్రం తోడైతే జిల్లాలోని రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగ్గా అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ ప్రమీల రాణి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ ముకుందరావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అమ్మవారికి బోనాల సమర్పణ

విశాలాంధ్ర-దుర్గి : ఆషాఢ పౌర్ణమి విశేషమైన రోజు సందర్భంగా ఈ నెల 21న మండల పరిధిలోని నిదానం పాడులో కొలువై ఉన్న భక్తుల పాలిట ఆరాధ్య దైవం అడిగొప్పల శ్రీలక్ష్మీ అమ్మవారికి బోనాలు సమర్పించాలని నిర్ణయించినట్లు దేవస్థానం వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పి.సైదమ్మబాయ్ శుక్రవారం విశాలాంధ్రకు తెలిపారు. కావున అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని, బోనాలు సమర్పణ పండుగలో భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా పొందాలని ఆమె కోరారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.19.31లక్షలు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని అడిగొప్పల గ్రామ శివారు నిదానంపాడులో వేంచేసియున్న మహాశక్తి పీఠం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానం హుండీ కానుకలు లెక్కించగా రూ.19,31,932ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పి.సైదమ్మబాయ్ తెలిపారు. భక్తులు 31 రోజులు పాటు అమ్మవారిని దర్శించుకుని హుండీల్లో సమర్పించిన కానుకలను హుండీల లెక్కింపు ప్రత్యేకాధికారి, కారంపూడి గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణా ధికారి కృష్ణంరాజు, ఆలయ వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఆలయ ముఖమండపంలో శుక్రవారం లెక్కింపు నిర్వహించారు. సేవా సంస్థల మహిళా సభ్యులు పాల్గొని కానుకలను లెక్కింపు చేపట్టారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అడిగొప్పల శాఖ అధికారులు దేవస్థానం వద్ద జరుగుతున్న హుండీ లెక్కింపు వద్దకు విచ్చేసి నగదును లెక్కించుకుని వచ్చిన మొత్తాన్ని అమ్మవారి ఖాతాలో జమ చేసి రశీదును ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ కిరణ్, అర్చకస్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వీరభద్రాచారి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో శుక్రవారం ఫ్రై డే - డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ఇళ్లల్లో వాడుకునే కుండీల్లో నీరు నిల్వ ఉండకూడదని, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో ఉంచకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు చెన్నారావు, ప్రభు కుమార్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, ఏఎన్ఎం నాగవాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వీసీగా గంగాధర రావు బాధ్యతలు

విశాలాంధ్ర-మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నూతన ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ కంచర్ల గంగాధర రావు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ తనపై నమ్మకంతో వైస్ ఛాన్సలర్‌గా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తానపై ఉంచిన బాధ్యతల ను నిర్వర్తించి యూనివర్సిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీలోని అందరి అధికారుల, ఉద్యోగుల, అధ్యాపకుల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధిని రెట్టింపు చేస్తానని పేర్కొన్నారు. విద్యా విషయక, పరిశోధన, బోధన రంగాలను బలోపేతం చేసి యూనివర్సిటీ స్థాయిని పెంచేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతన ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ గంగాధర్ రావుకు అభినందనల వెల్లువ కురిసింది. విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సంధ్యకోల్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ స్వరూప రాణి, ప్రొఫెసర్ సిద్దయ్య, ప్రొఫెసర్ జాన్సన్, ప్రొఫెసర్ శ్రీనివాస రెడ్డి, ప్రొఫెసర్ ప్రమీలరాణి, ఓఎస్డి ప్రొఫెసర్ కె.సునీత, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణలతో పాటు విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.